గంజాయి సేవిస్తున్న యువకుల పట్టివేత

వివరాలు వెల్లడిస్తున్న సీఐ రవీందర్

చెన్నూర్ రూరల్, మార్చి 5 : చెన్నూర్ మండలం కిష్టంపేట సమీపంలో గంజాయి సేవిస్తున్న 11 మంది యువకులను అదుపులోకి తీసుకున్నట్లు చెన్నూర్ సీఐ రవీందర్ తెలిపారు. చెన్నూర్ పోలీస్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కిష్టంపేట సమీపంలో పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో 11 మంది యువకులు పోలీసులను చూసి పారిపోయారు. వెంబడించి పట్టుకొని విచారించగా, గంజాయి సేవిస్తున్నట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి 250 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితుల్లో ఇద్దరు మైనర్లు ఉండగ, ఒక్కరు పారిపోయినట్లు వెల్లడించారు. యువకులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. యువకులు మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఎస్ఐ సుబ్బారావు ఉన్నారు.

పురుగుల మందుతాగి ఒకరి ఆత్మహత్య

దండేపల్లి, మార్చి 5 : దండేపల్లి మండలం వెల్గనూర్ గ్రామానికి చెందిన అక్కల మల్లేశం (79) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ తహసినుద్దీన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కొద్దిరోజుల క్రితం మల్లేశం తన ఇద్దరు కొడుకులు, భార్యను కోల్పోయాడు. వారి గురించే ఆలోచిస్తూ దిగాలుగా ఉంటూ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో విరక్తి చెందిన మల్లేశం మంగళవారం పురుగుల మందు తాగాడు. గమనించిన చుట్టు పక్కలవారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం లక్షెట్టిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్‌లోని ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లారు. కాగా, చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. కూతురు కాండ్రపు రాజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అతిగా మద్యం తాగి ఒకరు మృతి

దండేపల్లి, మార్చి 5 : దండేపల్లి మండల కేంద్రానికి చెందిన బొలిశెట్టి మల్లయ్య(59) అతిగా మద్యం తాగి మృతి చెందాడు. ఎస్ఐ తహసినుద్దీన్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లయ్య ఈ నెల 3న మద్యం తాగి పొలానికి నీరుపెట్టేందుకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చి భోజనం చేసి, మళ్లీ మద్యం తాగాడు. రాత్రి 11:30 గంటల సమయంలో పొలానికి నీరుపెట్టేందుకని ఇంటి నుంచి వెళ్లాడు. తిరిగిరాలేదు. ఉదయం కడెం సబ్ కెనాల్ రోడ్డు కల్వర్ట్ వద్ద పడిపోయి ఉన్నట్లు కుటుంబ సభ్యులకు సమాచారం వచ్చింది. వెళ్లి చూడగా, చనిపోయి ఉన్నాడు. అతిగా మద్యం తాగడం, గతంలో గుండెపోటు వచ్చి ఉండడం వల్ల చనిపోయాడని బంధువులు తెలిపారు. కొడుకు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

హాజీపూర్, మార్చి 5 : మండలంలోని వేంపల్లి గ్రామ శివారులో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక్కరు మృతిచెందగా, మరొక్కరికి తీవ్ర గాయాలైనట్లు హాజీపూర్ ఎస్ఐ గోపతి సురేశ్ తెలిపారు. లక్షెట్టిపేట మండలం చింతపల్లి గ్రామానికి చెందిన మేడిశెట్టి రాజలింగు (45), భార్య మేడిశెట్టి సుజాత బైకుపై మంచిర్యాల నుంచి గుడిపేటకు వస్తున్నారు. లక్షెట్టిపేట నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న కారు ఎదురుగా ఢీ కొట్టడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించగా, మెరుగైన చికిత్స కోసం సుజాతను హైదరాబాద్‌లోని వెల్‌నెస్ హస్పిటల్‌కు తరలించారు. రాజలింగును కరీంనగర్ తరలిస్తుండగా, పరిస్థితి విషమించడంతో తిరిగి మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తీసుకరాగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రాజలింగు పెద్ద కొడుకు మణికంఠ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇల్లు దగ్ధం

వాంకిడి, మార్చి 5 : మండలంలోని బంబార గ్రామ పంచాయతీ పరిధి బారేగూడలో వాడై దేవాజీ ఇల్లు మంగళవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది. ఫైర్ ఇంజిన్ ఘటనా స్థలానికి చేరుకునేలోగా కాలిపోయింది. ఇంట్లో పత్తి విక్రయించిన డబ్బు, నగలు, నిత్యావసర సరుకులు కాలిపోయాయని కట్టు బట్టలతో రోడ్డునపడ్డామని దేవాజీ దంపతులు బోరున విలపించారు. బుధవారం రెవెన్యూ ఆర్ఐ మాజీద్ పంచనామా నిర్వహించారు. తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

పిచ్చి కుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు

కన్నెపల్లి, మార్చి 5 : మండల కేంద్రంలో బుధవారం పిచ్చి కుక్కల దాడిలో ముగ్గురికి గాయాలయ్యాయి. నాలుగేళ్ల కొట్రంగి వెంకటేశ్ అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్తుండగా, పిచ్చి కుక్క దాడి చేసింది. తలకు గాయమైంది. ముత్తాపూర్ గ్రామానికి చెందిన సర్వర్ తహసీల్ కార్యాలయ సమీపంలో ఉండగా, దాడి చేసింది. చంద్రబాయిపైనా దాడి చేసి గాయపర్చింది. వారిని కుటుంబ సభ్యులు దవాఖానలకు తరలించారు. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి, పిచ్చి కుక్కల బెడద నివారించాలని కోరుతున్నారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

కోటపల్లి, మార్చి 5 : కోటపల్లి మండలం ఎదుల్లబంధం, పారుపల్లి గ్రామాల్లోని నాటుసారా స్థావరాలపై బుధవారం దాడులు నిర్వహించినట్లు చెన్నూర్ ఎక్సైజ్ సీఐ హరి తెలిపారు. ఎదుల్లబంధం గ్రామంలో నాటుసారా తయారుచేస్తున్న ఐదుగురిపై కేసు నమోదు చేయడంతో పాటు, 12 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. పారుపల్లిలో మూడు కేసులు నమోదు చేయడంతో పాటు, 12 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు

రేషన్ బియ్యం పట్టివేత

కాగజ్‌నగర్, మార్చి 5 : కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్, సీఆర్పీఎఫ్ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుకున్నారు. కాగజ్‌నగర్ నుంచి సంగరేణి రైలులో మహారాష్ట్రలోని వీరూర్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉన్న సుమారు 28.8 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు తెలిపారు. బియ్యం విలువ రూ.1,19,880 ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో సీఆర్పీఎఫ్ సీఐ శ్రీనివాస్ గౌడ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

రెబ్బెన, మార్చి 5 : సైబర్ జాగృత్కా దివాస్ పురస్కరించుకొని రెబెబన ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. డిజిటల్ అరెస్ట్, జాబ్ ఫ్రాడ్, సైబర్ స్లావేరి, సైబర్ స్టాకింగ్, అన్‌లైన్ గేమింగ్‌పై అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ప్రజావాణి అర్జీల పరిష్కారానికి చర్యలు

- ముగిసిన ఎన్నికల నియమావళి.. 10 నుంచి కార్యక్రమం ప్రారంభం
- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల ఏసీసీ : మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

ఎన్నికల కమిషనర్‌కు పూల మొక్క అందజేస్తున్న కలెక్టర్

మంచిర్యాల ఏసీసీ, మార్చి 5 : ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజలు సమర్పించే అర్జీల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం డీసీపీ ఏ భాస్కర్, అదనపు కలెక్టర్ సభావత్ మోతీలాల్‌తో కలిసి ఏసీపీలు, తహసీల్దార్లు, సీఐలు, ఎస్ఐలు, అధికారులతో సమీఓఆ సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముగిసిన తర్వాత 10వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తుల పరిష్కారంపై రెవెన్యూ, పోలీసు శాఖల సమన్వయంతో ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో మండలస్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి తహసీల్దార్, ఎస్‌హెచ్‌వో, మండల పంచాయతీ అధికారి, మున్సిపల్ పరిధిలో తహసీల్దార్, ఎస్‌హెచ్‌వో, మున్సిపల్ కమిషనర్ హాజరై అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. కనీసం 15 రోజులు, గరిష్టంగా 21 రోజుల్లోగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండల పరిధిలో పరిష్కారమయ్యే భూ సమస్యలను రికార్డులను సరిచూడాలని, దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి, పరిష్కరించాలని తెలిపారు. డివిజన్ స్థాయిలో ఆర్డీవో, ఏసీపీలు, జిల్లా స్థాయిలో కలెక్టర్, డీసీపీలు పాల్గొని అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, పరిష్కారానికి కృషిచేయననున్నట్లు తెలిపారు. ప్రతి దరఖాస్తుకు సంబంధించి ఆయా స్థాయిల్లో రిజిస్టర్ తప్పకుండా నిర్వహించాలని, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, తమ పరిధిలో లేని సమస్యలపై వచ్చిన దరఖాస్తులను ఉన్నత స్థాయికి సిఫారసు చేయాలని సూచించారు. మంచిర్యాల, జైపూర్, బెల్లంపల్లి ఏసీపీలు ప్రకాశ్, వెంకటేశ్వర్లు, రవికుమార్, తహసీల్దార్లు, సీఐలు, ఎస్ఐలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషనర్‌ను కలిసిన కలెక్టర్..

సీసీసీ నస్పూర్, మార్చి 5 : రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల కమిషనర్ జిల్లాకు రాగా, సీసీసీలోని సింగరేణి అతిథి గృహంలో బస చేశారు. కాగా, ఆమెను కలెక్టర్ కలిసి, పూల మొక్క అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు అంశాలపై చర్చించారు.

పశువులు వెళ్లేందుకు దారి ఇవ్వాలి

కోటపల్లి, మార్చి 5 : కోటపల్లి మండలం రొయ్యలపల్లి గ్రామంలోని పశువులు అడవిలోకి మేతకు వెళ్లేందుకు దారి ఇవ్వాలని గ్రామస్తులు కోరారు. పశువులు వెళ్లే మార్గంలో అటవీ అధికారులు కంచె నిర్మిస్తుండగా, గ్రామస్తులు అక్కడికి వెళ్లారు. దారికి అడ్డుగా కంచె నిర్మించడం వల్ల రానున్న రోజుల్లో పశువులకు మేత దొరకని పరిస్థితి నెలకొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. అడవిలోకి పశువులు వస్తే జరిమానా విధిస్తామని అటవీ అధికారులు హెచ్చరికలు చేస్తున్నారని వాపోయారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు ఎర్మ పున్నం, దాగామ శ్రీశైలం, గోమాస రాజం, రావుల బక్కయ్య, దుర్గం సురేశ్, రాజన్న, పర్శవేణి శంకర్, ఎర్మ సమ్మయ్య, కొర్తె శంకర్, కుమ్మరి సారయ్య, కావెరి కిష్టయ్య కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మందమర్రి, మార్చి 5 : మందమర్రి ఏరియాలోని సివిల్ విభాగంలో పని చేస్తున్న కార్మికులతో పాటు, కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ అన్నారు. బ్రాంచ్ ఉపాధ్యక్షుడు భీమనాథుని సుదర్శన్, నాయకులతో కలసి బుధవారం సివిల్ విభాగం కార్మికులను కలసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సివిల్ విభాగం కార్మికుల ఉద్యోగోన్నతులను మార్చి తరువాత ఇస్తామని యాజమాన్యం హామీ ఇచ్చినట్లు తెలిపారు. అలాగే కాంట్రాక్ట్ కార్మికుల హైపవర్ వేతనాల విషయాన్ని తమ యూనియన్ కేంద్ర అధ్యక్ష, కార్యదర్శులు సింగరేణి సీఎండీ బలరాం దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. యూనియన్ నాయకులు సోమిశెట్టి రాజేశం, టేకుమట్ల తిరుపతి, ఆంటోని దినేశ్, ముల్కలపల్లి వెంకటేశ్వర్లు, కలవల శ్రీనివాస్, మర్రి కుమార్, సీహెచ్‌పీ శర్మ, ఓదెలు, పారిపెల్లి సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

వేధింపులు అరికట్టాలి

తాండూర్, మార్చి 5 : తమను వేదింపులకు గురిచేస్తున్న తాండూర్ జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని మధ్యాహ్న భోజన కార్మికులు కోరారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో బుదవారం ఎంపీడీవో శ్రీనివాస్, డీటీ వీవీఆర్‌కేడీ ప్రసాద్, ఎమార్సీ కార్యాలయ సిబ్బంది ప్రశాంత్‌కు వినతి పత్రాలు అందించారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దాగాం రాజారం మాట్లాడుతూ.. 20 ఏళ్ల నుంచి మెనూ ప్రకారం సక్రమంగానే వంట చేసిపెడుతున్న కార్మికులను హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయురాలు జ్యోతి ఇబ్బందులు పెడుతున్నారన్నారు.

విజయవంతం చేయాలి

మంచిర్యాల (ఏసీసీ), మార్చి 5 : దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో వేములవాడలో 10వ తేదీ నుంచి జరిగే రాష్ట్ర సమావేశాలను విజయవంతం చేయాలని డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి దేవి పోశన్న పేర్కొన్నారు. బుధవారం మంచిర్యాల పట్టణంలో కరపత్రాలు పంచారు. దేశవ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన పదేళ్లలో దళితులపై హింస, హత్యలు, అత్యాచారాలు, దోపీడీ రెట్టింపు స్థాయిలో జరుగుతున్నాయని ఆరోపించారు. జిల్లా ఉపాధ్యక్షుడు మారుపెల్లి రవి, ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మొగిలి లక్ష్మణ్, నాయకులు పొనగంటి ఏసేపు, తిరుపతి, రవికుమార్ పాల్గొన్నారు.

మహిళల భరోసాకు కృషి

బెల్లంపల్లి, మార్చి 5 : మహిళల భరోసా కోసం షీ టీంలు ప్రత్యేకంగా కృషి చేస్తున్నాయని మహిళా కానిస్టేబుల్ జ్యోతి అన్నారు. కేజీబీవీ విద్యార్థినులకు బుధవారం మహిళల భద్రత, మహిళా చట్టాలు, మహిళలపై వేధింపులు, ఆన్‌లైన్ మోసాలు, సెల్‌ఫోన్ నష్టాలపై అవగాహన కల్పించారు. బస్టాండ్లు, ప్రధాన చౌరస్తాలు, కళాశాలలు, జన సమీకరణ ప్రాంతాల్లో ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు వెల్లడించారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి

కాసిపేట, మార్చి 5 : ముత్యంపల్లి జడ్పీహెచ్ ఎస్‌లో బుధవారం సోమగూడెం ఆదిత్య మెడికల్ షాప్ యాజమాని కందికట్ల రాంప్రకాశ్, ఎల్ ఐసీ ఏజెంట్, ఐకేపీ వీవోఏ పేరాల మహేశ్ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందించారు. తాను చదువుకున్న పాఠశాలలో విద్యార్థులకు తన వంతుగా సాయం అందించాలనే ఉద్దేశంతో సామగ్రి పంపిణీ చేసినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు పుష్పలత, జ్యోతి, మాదవి లత, పల్లె కృష్ణ గోపాల్ రావు, చంద్రశేఖర్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్

రెబ్బెన, మార్చి 5 : రెబ్బెన మండల కేంద్రంలోని ఎస్వీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో బుధవారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్ ఆకట్టుకున్నది. విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించిన ఆకృతులు అతిథులను అకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల జిల్లా అధ్యక్షుడు దేవ భూషణం, సింగరేణి అసిస్టెంట్ మేనేజర్ సాయి తేజ, కరస్పాండెంట్ దీకొండ సంజీవ్‌కుమార్, రెబ్బెన ప్రాథమిక పాఠశాల హెచ్ఎం అనూష భాను, ఉపాధ్యాయులు విజయకుమారి, రుక్మిణి, తిరుపతి, మౌనిక, హిమబింధు, మంజు, దేవిక, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికావద్దు

రెబ్బెన, మార్చి 5 : విద్యార్థులు పరీక్షా సమయంలో ఒత్తిడికి గురికావద్దని మోటివేషనల్ స్పీకర్ సుమలత సూచించారు. బేటీ బచావో బేటీ పడావో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గంగాపూర్ కేజీబీవీలో బుధవారం జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రేరణ, స్ఫూర్తిదాయక విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత జెండర్ స్పెషలిస్ట్ రాణి, ఎస్‌వో పద్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

జనరల్ మేనేజర్‌కు సన్మానం

శ్రీరాంపూర్, మార్చి 5 : శ్రీరాంపూర్ జీఎంగా బాధ్యతలు చేపట్టిన ఎం శ్రీనివాస్‌ను బుధవారం సింగరేణి విద్యాశాఖ కార్యదర్శి గుండా శ్రీనివాస్ కలిసి ఘణంగా సన్మానించారు. సింగరేణి పాలిటెక్నిక్ కళాశాల, పాఠశాలకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని జీఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. కార్మికుల పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు వెనకాడేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల మైనింగ్ హెచ్ఓడీ నర్సింహస్వామి, సింగరేణి పాఠశాల హెచ్ఎం సంతోష్, టీచర్ రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాల అర్బన్, మార్చి 5 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ దవాఖానలో విధులు నిర్వహిస్తున్న శానిటేషన్, స్వీపర్స్, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు బుధవారం దవాఖాన సూపరింటెండెంట్ హరీశ్ చంద్రా రెడ్డికి వినతి పత్రం అందజేశారు. తక్షణమే పెండింగ్ వేతనాలు చెల్లించి, వారి కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పలు విషయాలను వారి దృష్టికి తీసుకవెళ్లారు. దవాఖాన సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

బదిలీ అధికారికి సన్మానం

మందమర్రి, మార్చి 5 : మందమర్రి ఏరియా ఎస్టేట్ అధికారి స్వప్న ఉద్యోగోన్నతిపై మణుగూరు ఏరియాకు బదిలీపై వెళ్తుండగా, జీఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం అధికారులు సన్మానించారు. అలాగే గోలేటి ఏరియా నుంచి మందమర్రికి బదిలీపై వచ్చిన ఎస్టేట్ అధికారి నవనీతకు పుష్ప గుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఏరియా ఇన్‌చార్జి జీఎం అబ్దుల్ ఖాదీర్, ఇన్‌చార్జి ఎస్‌వోటూ జీఎం రవీందర్, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, అన్ని విభాగాల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఆటల పోటీలు

చెన్నూర్ రూరల్, మార్చి 5 : మహిళా సాధికారిత విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని కిష్టంపేట డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు ఆటలు, సాంస్కృతిక పోటీలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ పట్వర్ధన్, మహిళా సాధికారిత విభాగ సమన్వయకర్త శిరీష ప్రారంభించారు. పోటీల్లో విజేతలకు మహిళా దినోత్సవం రోజున బహుమతులు అందించనున్నట్లు ప్రిన్స్‌పాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

కాగజ్‌నగర్, మార్చి 5 : పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని కాగజ్‌నగర్ ఎంఈవో ప్రభాకర్ విద్యార్థులకు సూచించారు. ఆరెగూడ జడ్పీఎస్ఎస్ పాఠశాలలో బుధవారం పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. పరీక్షలంటే భయపడకుండా మంచి మార్కులు సాధించాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు పేరు తేవాలని సూచించారు. హెచ్ఎం పర్సా చంద్రశేఖర్, ఉపాధ్యాయులు రవి, అనిత, బాలాజీ, సుగుణ, మహేశ్, సత్యనారాయణ, విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

నింబంధనలు పాటించకపోతే చర్యలు

మంచిర్యాల అర్బన్, మార్చి 5 : జిల్లాలో నిర్వహిస్తున్న స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు సరైన నిబంధనలు పాటించాలని, లేకపోతే కఠిన చర్యలు తప్పవని మంచిర్యాల జిల్లా వైద్యాధికారి హరీశ్ రాజ్ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తాలోగల బాలజీ స్కానింగ్ సెంటర్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలో 5 ప్రభుత్వ, 47 ప్రైవేటు స్కానింగ్ సెంటర్లు ఉన్నాయన్నారు. 52 సెంటర్లలో తనిఖీలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ముందుగా బాలాజీ, కీర్తి స్కానింగ్ సెంటర్లలో తనిఖీ చేసి, పలు సూచనలు చేసినట్లు పేర్కొన్నారు. స్కానింగ్ కేంద్రాలకు వచ్చే గర్భిణులకు సరైన సౌకర్యాలు కల్పించాలని, పూర్తి వివరాలు తీసుకున్న తర్వాతే స్కానింగ్ చేయాలని సూచించారు. ఎట్టిపరిస్థితుల్లో లింగనిర్ధారణ సరికాదన్నారు. గర్భిణుల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. స్కానింగ్ కేంద్రాల తనిఖీ కోసం ఎంసీహెచ్ ప్రోగ్రాం ఆఫీసర్ డా కృపాబాయి, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ వసుమతి, ఎల్‌డీ రాజేశ్వర్లతో కూడిన కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

విద్యతోనే ఆదివాసుల అభివృద్ధి

సిర్పూర్(యూ), మార్చి 5 : విద్యతోనే అదివాసీ కొలాం ప్రజలు అభివృద్ధి చెందగలరని ఏఎస్పీ చిత్త నిరంజన్ అన్నారు. మండలంలోని రుద్రకస్సా గ్రామంలోని ఆదివాసీ కొలాం ప్రజలకు బుధవారం బియ్యం, కూరకాయలు, తదితర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా వారితో ముచ్చటించారు. గ్రామంలోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తుల కోరిక మేరకు గ్రామంలో మంచి నీటి కోసం బోరు వేయిస్తామని హామీ ఇచ్చారు. కొలాం ప్రజలు తమ పిల్లలను తప్పనిసరిగా బడికి పంపించాలని, ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ రమేశ్, ఎస్ఐ రామకృష్ణ, నాయకులు, ప్రజలు పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఆత్మహత్య కారకులను శిక్షించాలి

మందమర్రి, మార్చి 5 : తన భర్త బలవన్మరణానికి కారుకులైన వారిపై కేసులు నమోదు చేసి, శిక్షించాలని మందమర్రి మున్సిపాలిటీ పరిధి రామన్ కాలనీకి చెందిన నస్పూరి వినయ్ భార్య భాగ్యలక్ష్మి డిమాండ్ చేసింది. అదే కాలనీకి చెందిన శ్రీనివాస్ తన భర్తను అవమానించి, ఆత్మహత్యకు ప్రేరేపించాడని ఆరోపిస్తూ, అతడి ఇంటి ఎదుట బుధవారం పిల్లలతో కలసి భైఠాయించి ఆందోళన చేపట్టింది. భాగ్యలక్ష్మికి రజక వృత్తిదారుల సంఘం నాయకులతో పాటు, స్థానికులు మద్దతుగా నిలిచారు. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. తన భర్త వినయ్‌పై కొద్ది రోజులుగా వేదింపులు కొనసాగాయని, శ్రీనివాస్ తన మిత్రులతో కలసి తీవ్రంగా వేధించాడని ఆరోపించింది. తట్టుకోలేక అవమానభారంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడని వాపోయింది. అందుకు కారణమైన శ్రీనివాస్, సురేందర్, నరేందర్, రాజిరెడ్డిపై కేసులు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలని కోరింది. రజక వృత్తి దారులు సంఘం జిల్లా కార్యదర్శి పాయిరాల రాములు, ముస్కె చందర్, పాపయ్య, శ్రీనివాస్, పోశం, కిష్టయ్య, స్థానికులు మద్దతు తెలిపారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా

సీసీసీ నస్పూర్, మార్చి 5 : వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు కృషిచేస్తున్నట్లు మంచిర్యాల జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ వీ గంగాధర్ పేర్కొన్నారు. 33/11కేవీ నస్పూర్ సబ్ స్టేషన్‌లో 8 ఎంవీఏ పీటీఆర్ చార్జింగ్, 11 కేవీ కలెక్టరేట్ వీసీబీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను 8 ఎంవీఏకు అప్‌గ్రేడ్ చేశామని తెలిపారు. దీంతో పాటు, అదనంగా బంచ్‌డ్ ఫీడర్‌ను వేరు చేసి, 11 కేవీ కలెక్టరేట్ వీసీబీని విజయవంతంగా చార్జ్ చేశామన్నారు. ఈ అప్‌గ్రేడ్‌తో నస్పూర్ సబ్ స్టేషన్ నుంచి వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీఈ(ఓపీ), మంచిర్యాల డీఈ(ఎంఆర్‌టీ), ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణం అడ్డగింత

కౌటాల, మార్చి 5 : కౌటాలలోని అటవీ భూమిలో నేరెళ్ల జనార్దన్ ఇంటి నిర్మాణం చేపడుతున్నాడంటూ అటవీ శాఖ అధికారులు బుధవారం పనులను అడ్డుకున్నారు. భూమి ఆక్రమించుకొని నిర్మాణం చేపడుతున్నాడని మంగళవారం అటవీ అధికారులు నోటీసులు అంటించారు. అయినా జనార్దన్ పనులు కొనసాగిస్తుండడంతో ఎఫ్ఎస్‌వో తులసీదాస్ నాయక్, ఎఫ్‌బీవో శ్రీదేవి అడ్డుకున్నారు. ఇలా అక్రమంగా పనులు చేపట్టడం చట్టరీత్యా నేర